సాక్షి ఖమ్మం

మంగళవారం । 16 । జూలై । 2024



అర్చకుల బదిలీలపై రగడ
అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల మాదిరిగానే అర్చకుల బదిలీలకు జాబితా రూపొందించగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 8లో



... ఇలాగే వదిలేస్తారా?
రెబ్బవరంలోని జ్యోతిబాపూలే గురుకులంలో అసౌకర్యాలపై నివేదిక ఇవ్వకపోవడంతో జీసీడబ్ల్యూఓ జ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు 8లో



వాతావరణం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం కురిసే అవకాశముంది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

మత్తుపై ఉక్కుపాదం

యాంటీ నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు

ఖమ్మంక్రైం: డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో 'యాంటీ నార్కోటిక్ డ్రగ్ కంట్రోల్ సెల్' పేరిట ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. అంతేకాక సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని నియంత్రించేందుకు ఈ బృందాలు నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. మాదకద్రవ్యాల క్రయ, విక్రయాల సమాచారాన్ని వాట్సప్ ద్వారా లేదా ఫోన్ ద్వారా తెలియచేసేందుకు యాంటీ డ్రగ్ కంట్రోల్ సెల్‌కు 87126 59123 నంబర్ కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సమాచారం ఇచ్చిన వారి వివరాలకు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కాగా, విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లోనూ సదస్సులు నిర్వహిస్తున్నామని సీపీ పేర్కొన్నారు. మరోపక్క జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో కట్టుదిట్టమైన నిఘా ద్వారా మత్తు పదార్థాలను రవాణాకు అడ్డుకట్ట వేయనున్నామని కమిషనర్ తెలిపారు.

చెరువుల ఆధునికీకరణకు ఆమోదం

మూడు చెరువులకు రూ.63.70 లక్షలు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో మూడు చెరువుల ఆధునికీకరణ పనులకు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆమోదం లభించింది. గతంలోనే జిల్లాలో పలు చెరువుల మరమ్మతులు, ఆధునికీకరణ పనులకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటిపై అధ్యయనం చేసిన కమిటీ మూడు పనులకు ఆమోదం తెలిపి రూ.63.70లక్షలు కేటాయించింది. ఈమేరకు మధిర డివిజన్‌లోని కల్లూరు సర్కిల్ పరిధి ముదిగొండ మండలం కట్కూరు–సీతారాంపురం మధ్య పెద్దచెరువుపై తూము, కరకట్ట, చెరువులోకి వెళ్లేందుకు దారి పనులు చేపట్టేందుకు రూ.35.05 లక్షలు కేటాయించారు. కొణిజర్లలోని ఊర చెరువు, చీకటి చెరువుల్లో పూడికతీతతోపాటు కరకట్టను దృఢంగా నిర్మించడం, తూముల ఏర్పాటు పనులకు కోసం రూ.28.65 లక్షలు వెచ్చించనున్నారు. ఈ పనులకు సంబంధించి పూర్తి వివరాలతో అధికారులు ప్రతిపాదనలు సమర్పించాక టెండర్లను పిలవనున్నారు.

నీటి పారుదల శాఖలో బదిలీల జాబితా సిద్ధం

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖ పరిధిలో దీర్ఘకాలికంగా ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధమైంది. ప్రభుత్వ విధివిధానాల ప్రకారం ఖమ్మం చీఫ్ ఇంజనీర్ పరిధిలోని రెండు సర్కిళ్లు, ఆరు డివిజన్ల పరిధి కార్యాలయాల్లో బదిలీకి అర్హులైన వారి జాబితాను ఉన్నతాధికారులకు పంపించారు. ఈ జాబితాలో తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు సూపరింటెండెంట్లు, 14 మంది జూనియర్ అసిస్టెంట్లు, నలుగురు టైపిస్టులు, 22 మంది అటెండర్లు ఉన్నట్లు తెలిసింది. ఉద్యోగులను మల్టీ జోన్ పరిధిలో బదిలీ చేయాల్సి ఉండడంతో ఈఎన్‌సీ పర్యవేక్షించనున్నారని జిల్లా అధికారి ఒకరు తెలిపారు. ఈమేరకు సీఈ ద్వారా వెళ్లిన జాబితాకు ఈఎన్‌సీ ఆమోదం లభించగానే ఒకటి, రెండు రోజుల్లో బదిలీ ఉత్తర్వులు జారీ చేసే అవకాశముందని తెలిసింది.

కొత్తగూడెం కేంద్రంగా ఆర్టీసీ డిస్పెన్సరీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రీజియన్‌లో కొత్తగూడెం కేంద్రంగా ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేయనున్నట్లు రీజినల్ మేనేజర్ ఏ.సరిరాం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో ఖమ్మం కేంద్రంగా ఒకటే ఆస్పత్రి ఉండడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని సంస్థ ఎండీ దృష్టికి తీసుకెళ్లగా కొత్తగూడెంలో అదనపు ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని తెలిపారు. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోలకు సంబంధించిన ఉద్యోగులు ఇక నుండి కొత్తగూడెంలో వైద్య సేవలు పొందొచ్చని, ఖమ్మంలో ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల ఆర్టీసీ ఉద్యోగులకు యథావిధిగా వైద్య సదుపాయాలు అందుతాయని ఆర్‌ఎం వెల్లడించారు.

25లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ) 2022–24 బ్యాచ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో పాటు ఒకసారి ఫెయిలైన వారు ఈనెల 25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. అలాగే, రూ.50 అపరాధ రుసుంతో ఆగస్టు 1వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశముందని తెలిపారు. పూర్తి వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఆయన వెల్లడించారు.

ఇంకొన్నాళ్ల తర్వాతే..



నిలిచిన భూముల ధరల సవరణ ప్రక్రియ
- జిల్లాలో ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- శాస్త్రీయత కోసం వాయిదా వేసిన ప్రభుత్వం
- అమల్లోకి రావడానికి మరింత సమయం పడుతుందని అంచనా

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విలువ పెంచేందుకు ప్రభుత్వం నెల రోజుల క్రితం స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యాన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించి ఎక్కడెక్కడ భూవిలువలను ఎంత మేర సవరించాలనే అంశంపై అంచనాకు వచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రాంతాల వారీగా ధరల పెంపుపై అధికారులు ప్రతిపాదనలను సైతం సిద్ధం చేశారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ధరలతో పోలిస్తే బహిరంగ మార్కెట్ విలువ అధికంగా ఉందని, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉండడాన్ని గుర్తించి చేయాల్సిన సవరణలను ప్రతిపాదనల్లో పొందుపరిచారు. అయితే, గత నెల 29న కమిటీల ముందు ఉంచిన ప్రతిపాదిత ధరలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉన్నా ప్రభుత్వ సూచనలతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

వ్యత్యాసాలు సరిచేయాలని...

కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూముల ధర బహిరంగ మార్కెట్‌లో పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వ ధరలతో పోలిస్తే బహిరంగ మార్కెట్ విలువ నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంది. ఇంకొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ పెరగకపోవడం.. అక్కడ ప్రభుత్వ విలువే అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఇదికాక ఖమ్మం త్రీటౌన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ ధర బహిరంగ మార్కెట్ విలువలతో సమానంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఈ ప్రాంతంలో ధర తగ్గించాలనే డిమాండ్ వస్తోంది. ఈ అంశాలతో నివేదిక రూపొందించిన అధికారులు ప్రభుత్వానికి సమర్పించగా, ప్రభుత్వ పెద్దలు ధరల పెంపు శాస్త్రీయంగా చేపట్టాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. పలు ప్రాంతాల్లో ధరల్లో వ్యత్యాసాలు ఉండడం, గతంలో ధరలు పెంచినా పద్ధతి ప్రకారం జరగలేదని ప్రభుత్వం గుర్తించినట్లు సమాచారం. దీంతో విలువ పెంపు ప్రక్రియ ఆలస్యమైనా శాస్త్రీయంగా జరగాలనే భావనకు రాగా.. అవసరమైతే థర్డ్ పార్టీ చేత నివేదిక సిద్ధం చేయించాలనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల విలువ సవరించి రూపొందించిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ప్రస్తుత మార్కెట్ విలువ, బహిరంగ మార్కెట్ విలువల ఆధారంగా కనిష్ట, గరిష్ట ధరలను నిర్ణయించినట్లు సమాచారం. ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల్లో భూధరలు భారీగా పెంచాలని నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది. ఇదేసమయాన వాణిజ్య ప్రాంతాలను పక్కాగా గుర్తించి ధరలు పెంచాలని ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిసింది. ఈనేపథ్యాన ధరల సవరణకు ప్రతిపాదనలు సమర్పించినా... ఇరవై రోజులుగా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. దీంతో ధరల పెంపు ఎప్పుడు ఉంటుందా.. ప్రభుత్వం మళ్లీ ఏమైనా మార్పులు సూచిస్తుందా అన్న కోణంలో యంత్రాంగం వేచిచూసే ధోరణి అవలంబిస్తోంది.

అధికారులు సమర్పించిన ప్రతిపాదనలు
- నివాస ప్రాంతాల్లో గజం విలువ ప్రస్తుతం కనిష్టంగా రూ.300 ఉండగా రూ.500కు, గరిష్ట ధర రూ.26,400 నుంచి రూ.26,500 లకు పెంచాలి.
- వాణిజ్య ప్రాంతాల్లో కనిష్ట ధర రూ.వెయ్యి నుంచి రూ.3వేలకు, గరిష్ట ధర రూ.44,900నుంచి రూ.45,000కు పెంపు
- అపార్ట్‌మెంట్లకు సంబంధించి కనిష్ట ధరను రూ.1,300 నుంచి రూ.1,500కు, గరిష్ట ధర రూ.3,500 నుంచి రూ.3,800కు పెంచాలి.
- వ్యవసాయ భూములు ఎకరాకు కనిష్ట ధర రూ.2.25లక్షల నుంచి రూ.4లక్షలకు, గరిష్ట ధర రూ.2,43,75,000 నుంచి రూ.2.90 కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు.

గత పాలకుల నిర్లక్ష్యమే కారణం



అపరిశుభ్రంగా ఉన్న వీధులను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- జల్లేపల్లిలో పర్యటించిన మంత్రి పొంగులేటి
- పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అధికారులు
- పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆదేశం

తిరుమలాయపాలెం: గత పాలకుల నిర్లక్ష్యంతోనే గ్రామాల్లో మౌలిక వసతులు కొరవడి పారిశుద్ధ్య లోపంతో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారి రోజురోజుకు డెంగీ కేసులు పెరుగుతుండగా.. గ్రామ సమస్యలపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి సోమవారం మంత్రి గ్రామంలో పర్యటించారు. బీసీ, ఎస్టీ కాలనీల్లో కాలినడకన తిరుగుతూ మురుగునీటి గుంతలు, చెత్తకుప్పలు పేరుకుపోయినట్లు గుర్తించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగంగా చేపట్టి పరిస్థితులు చక్కదిద్దాలని పీఆర్ ఈఈ వెంకటరెడ్డిని మంత్రి ఆదేశించారు. అలాగే, జ్వర పీడితుల ఇళ్లకు వెళ్లి భరోసా కల్పించారు. జ్వరాల బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని డీఎంహెచ్‌ఓ మాలతికి సూచించారు. అంతేకాకుండా ఇంటింటికీ దోమతెరలు సరఫరాచేయాలని, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. కాగా, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మిని ఇతర పోస్టులోకి బదిలీ చేయాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని చెప్పారు. ఏ గ్రామానికి వెళ్లినా వసతులపై దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ కె.శేషాద్రి ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ నాయకులు చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, పోట్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మంత్రితో కలిసి గ్రామంలో పర్యటించాక కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వివిధ శాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు.



వైద్యసేవలపై సూచనలు చేస్తున్న మంత్రి

గిరిజన విద్యార్థినికి ఆర్థికసాయం

మండలంలోని చంద్రుతండాకు చెందిన బోడ పూజ హరియాణా రాష్ట్రంలోని రోహతక్ ఐఐఎంలో సీటు సాధించడంతో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు కళాశాల ఫీజు ఇతర ఖర్చుల నిమిత్తం సోమవారం ఆర్థికసాయం అందించారు. కాగా, పూజ తల్లిదండ్రులు లక్ష్మణ్, లక్ష్మి ఎకరం భూమిలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుండగా ఆమె కష్టపడి చదువుకుని ఈ ఏడాది ఐఐఎంలో సీటు సాధించిన విషయం విదితమే.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రానివ్వం

ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



కేంద్రియ విద్యాలయంలో మొక్క నాటుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: ప్రతీ తల్లిదండ్రులు వారి పిల్లలను ఉన్నత స్థితికి చేర్చాలని చదివిస్తుంటారని, వారి నమ్మకం వమ్ము కాకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని వసతులు కల్పిస్తామని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాల, గిరిజన సంక్షేమ శాఖ బాలికల కళాశాల వసతి గృహంతో పాటు ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని కేంద్రియ విద్యాలయాన్ని ఎంపీ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే, విద్యాసంస్థల ఆవరణలో ఎంపీ మొక్కలు నాటారు. కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, కళ్లెం వెంకటరెడ్డి, కొప్పుల చంద్రశేఖరరావు, బి.కూర్మారావు, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు మహేష్, కాకి శ్రీను, నగేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి..



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



చేయూత, సదరమ్ దరఖాస్తుల స్వీకరణ కేంద్రం

- గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కేంద్రం, కుర్చీల ఏర్పాటుకు ఆదేశం

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అతర్వాత వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యలను విన్నవించేందుకు వస్తారని, వారు పదేపదే తిరగకుండా పరిష్కరించాలని తెలిపారు. కాగా, రెవెన్యూ సంబంధిత అంశాలతోపాటు సదరం సర్టిఫికెట్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తక్షణ స్పందన

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌కు రాగానే ప్రజావాణి వివరాల నమోదు కేంద్రం వద్ద ఎక్కువ మంది వేచి ఉండడాన్ని గుర్తించారు. అందులో వృద్ధులు కూడా కనిపించడంతో కుర్చీలు వేయించారు. అంతేకాక చేయూత పింఛన్లు, సదరమ్ ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయించారు.

నాకు గుర్తుంది...

'సార్.. మాకు వేతనాలు రావటం లేదు' అంటూ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కూలీలు కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో ఆయన వారి మాటలు పూర్తికాకుండానే 'మీరు ఈ మధ్య నాకు చెప్పారు... గుర్తుంది... త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది' అని చెప్పడంతో కూలీలు ఆనందంగా పనికి వెళ్లారు.

ఫిర్యాదుల్లో కొన్ని...



- ఎర్రుపాలెం మండలం బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన జంగా రవీందర్‌రెడ్డి మామిడితోటకు డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తామన్న అధికారులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆయన నేలపై కూర్చుని నిరసన తెలపగా కలెక్టర్ వేదిక దిగొచ్చి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.
- బీరోలుకు చెందిన గోపోజు సురేష్ దివ్యాంగుల కోటా కింద ఉపాధి కల్పించాలని కోరారు.
- కొణిజర్ల మండలం గద్దలగూడెంకు చెందిన సీతారాములు ఉపసర్పంచ్‌గా పనిచేసినప్పుడు వెచ్చించిన నిధులు ఇప్పించాలని కోరారు.
- బోనకల్ మండలం ఆళ్లపాడులో చేబ్రోలు రాజగోపాలం, చేబ్రోలు కృష్ణయ్యకు వారసత్వంగా సంక్రమించిన భూమికి పాస్ పుస్తకం ఇప్పించాలని కోరారు.
- ఖమ్మంలో తమ భూమిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని చేపూరి పద్మ, శ్రావణి, నైనిషా, నవజ్యోతి ఫిర్యాదు చేశారు.

సీఎంను కలిసిన రాయల



సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న రాయల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాయల నాగేశ్వరరావు సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను సత్కరించి తన నియామకంపై కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్ మేళాలో 24 మంది ఎంపిక

ఖమ్మం రాపర్తినగర్: నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సోమవారం జిల్లా కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం 80మంది హాజరు కాగా ఇందులో 24మంది మహిళలను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యాన ఈ జాబ్‌మేళా నిర్వహించినట్లు జిల్లా ఉపాధికల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు.

అరుణాచలం యాత్రకు అదనపు బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: గురుపౌర్ణిమను పురస్కరించుకుని అరుణాచలం యాత్రకు వెళ్లే భక్తుల కోసం ఖమ్మం ఆర్టీసీ రీజియన్ నుండి రెండు సర్వీసులు ఏర్పాటుచేయగా మంచి ఆదరణ లభిస్తోందని ఆర్‌ఎం ఏ.సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు ఖమ్మం, భద్రాచలం నుంచి 19వ తేదీన ప్రారంభం కానుండగా పరిమితికి మించి భక్తులు ముందుకొస్తే అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈమేరకు భక్తులు బస్టాండ్లలోని రిజర్వేషన్ కౌంటర్లు, సంస్థ వెబ్‌సైట్ లేదా ఏటీబీ సెంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 99592 25985, 99592 25960 నంబర్లలో సంప్రదించాలని ఆర్‌ఎం సూచించారు.

క్లుప్తంగా

దేశానికి ప్రమాదకరంగా మతోన్మాదం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మధిర: మతోన్మాదం దేశానికి పెనుముప్పుగా మారుతోందని సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మిరియం వెంకటేశ్వర్లు తెలిపారు. మధిర మండలం దెందుకూరులో జరుగుతున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను రెండో రోజైన సోమవారం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రారంభించగా, వెంకటేశ్వర్లు మాట్లాడారు. కష్టాలు, కన్నీళ్లతో నిండిన ప్రజలకు ఊరట కలిగించే సాధనంగా మతం కొనసాగుతుండగా.. పాలకులు మాత్రం ప్రజలను కులం, మతం పేరుతో విభజిస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు వ్యత్యాసాలు సృష్టించి మతోన్మాదానికి దారి తీస్తున్నారని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేవీఎస్ రీజినల్ ఆర్చరీ టోర్నీలో ప్రతిభ



సహస్రను అభినందిస్తున్న డీవైఎస్, కోచ్

ఖమ్మం స్పోర్ట్స్: కేంద్రియ విద్యాలయాల సమితి రీజినల్ ఆర్చరీ మీట్‌లో ఖమ్మంకు చెందిన కె.లక్ష్మీసహస్ర తృతీయస్థానంలో నిలిచింది. ఇటీవల జరిగిన పోటీల్లో ఫైనల్ రౌండ్ వరకు చేరిన ఆమె అద్భుతమైన ప్రదర్శన కనబర్చింది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కోచ్ నగేష్ వద్ద శిక్షణ పొందుతున్న సహస్రను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు సోమవారం అభినందించారు.

హాస్టల్ వార్డెన్‌పై విద్యార్థుల దాడి

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని కోర్టు సమీపాన ఒక ప్రైవేట్ కాలేజీ వార్డెన్‌పై సోమవారం విద్యార్థులు దాడి చేసినట్లు తెలిసింది. కాలేజీలో ఉంటూ ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు, వార్డెన్ నడుమ ఘర్షణ చోటు చేసుకుంది. ఈక్రమంలో అంతా కలిసి వార్డెన్‌పై దాడి చేసినట్లు సమాచారం. దీంతో కాలేజీ యాజమాన్యం ఆయనను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవడం లేదని ఆత్మహత్యాయత్నం

ఖమ్మంఅర్బన్: ఏఆర్ కానిస్టేబుల్ రాంబాబుపై ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదుచేసినా చర్యలు తీసుకోవడం లేదంటూ ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. ఇటీవల ఓ వివాహితతో కానిస్టేబుల్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, కానిస్టేబుల్‌పై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని చెబుతూ ఆదివారం రాత్రి ఆయన అధిక మోతాదులో నిద్రమాత్రలు మింగగా కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, ఆయన బయటే మాత్రలు మింగాక ఇంటికి వెళ్లి 'పిల్లలను జాగ్రత్తగా చూసుకోండి.. నేను అందరికీ దూరంగా వెళ్లిపోతున్నా' అని చెప్పడంతో పాటు మాత్రలు మింగిన విషయాన్ని వెల్లడించగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వైరా: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా విద్యుద్దీకరణ పనులు చేపడుతున్న సంస్థగోదాం నుంచి అల్యూమినియం కండక్టర్ వైరు చోరీ చేసిన వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ తెలిపారు. వైరాలోని పాతసెంటర్‌లో వాహనాల తనిఖీ చేపట్టగా ఓ ట్రాలీ ఆటోను ఆపకుండా వెళ్లారు. దీంతో పోలీసులు వెంబడించి పట్టుకోగా అల్యూమినియం కండక్టర్ వైరు లభ్యమైంది. అందులోని వ్యక్తి వైరా ఇందిరమ్మ కాలనీకి చెందిన మునగాల నరసింహారావుగా తేలగా, వైరు చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో ఆయనను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యాబిడ్డల హత్య కేసులో నిందితుడి రిమాండ్

రఘునాథపాలెం: భార్య, ఇద్దరు కుమార్తెలను హత్య చేసిన బోడా ప్రవీణ్‌ను సోమవారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీహరి తెలిపారు. గత మార్చి 28న రఘునాథపాలెం మండలం బావోజీతండాకు చెందిన డాక్టర్ ప్రవీణ్ కారులో భార్య కుమారి, పిల్లలను తీసుకెళ్లి హత్యచేసిన విషయం విదితమే. భార్యకు అధిక మోతాదులో మత్తు ఇవ్వడంతో పాటు పిల్లల నోరు, ముక్కు మూసి హత్య చేసి.. ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేసినా పోలీసు దర్యాప్తులో నిజం బయటపడడంతో ప్రవీణ్‌ను ఆదివారం అరెస్ట్ చేశారు. ఈమేరకు అయనను సోమవారం రిమాండ్‌కు తరలించగా, ప్రవీణ్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ హత్యకు ప్రేరేపించిన కేరళకు చెందిన నర్స్ సోనీ ఫ్రాన్సిస్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

అర్చకుల బదిలీలపై రగడ

- వివరాలను సేకరించిన దేవాదాయ శాఖ
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న అర్చకులు
- మినహాయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు



భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అర్చకుల బదిలీలకు కూడా జాబితా సిద్ధం చేసింది. అయితే, మునుపెన్నడూ లేని విధంగా అర్చకుల బదిలీ అంశాన్ని తెరపైకి తీసుకురావడం వారిలో ఆందోళనకు కారణమైంది. పూర్వీకుల నుంచి పలువురు వంశపారంపర్యంగా అర్చకత్వం చేస్తుండగా.. ప్రభుత్వాలు వారిని ఉద్యోగులుగా గుర్తించి సీనియారిటీ ఆధారంగా జీతభత్యాలు చెల్లిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని భద్రాచలం, జమలాపురం వంటి దేవాలయాల్లో అసిస్టెంట్ కమిషనర్, గ్రేడ్–1 నుంచి 3 వరకు స్థాయిలో అర్చకులు విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన ఆలయాల్లో అర్చకులు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు పొందుతున్నారు. ఈనేపథ్యాన ఉద్యోగులకు సమాన కేడర్‌గా వేతనాలు పొందుతున్నందున అర్చకులను సైతం దేవాదాయ బదిలీ ప్రక్రియలో చేర్చడం చర్చనీయాంశంగా మారింది. అయితే, రాష్ట్రంలోని కొన్ని ఆలయాల్లో అర్చకులు నిబంధనలకు విరుద్ధంగా తమ స్థానంలో ఇతరులను ఏర్పాటు చేశారనే ఆరోపణలు రావడంతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ గుర్తించి బదిలీకి సిద్ధమైందనే చర్చ జరుగుతోంది.

జాబితాలో 100మంది

బదిలీల ప్రక్రియలో భాగంగా వివిధ కేడర్ల అధికారులు, ఉద్యోగుల వివరాలతో పాటు అర్చకుల వివరాలను సైతం అధికారులు సేకరించారు. ఒకే ఆలయంలో రెండేళ్ల మొదలు నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన వారి వివరాలతో ఉన్నతాధికారులకు జాబితా సమర్పించారు. ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాలోని ఆలయాలకు సంబంధించి 100 మంది వరకు అర్చకులు ఉన్నారని తెలిసింది. అయితే, బదిలీలను అర్చకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు వేర్వేరుగా ఉండగా.. ఓ ఆలయంలో అర్చకత్వం చేసే వారు ఇంకో ఆలయంలో చేయలేరని చెబుతున్నారు. వంశపారంపర్యంగా నేర్చుకున్న ఆగమ శాస్త్రాల ప్రకారం పూజలు చేస్తున్న తమను బదిలీ చేయటం సరికాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు తమకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని అర్చక సంఘం ప్రతినిధులు సీఎం, మంత్రులతో పాటు దేవాదాయ శాఖ కమిషనర్, ఉన్నతాధికారులను కలిసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు కొందరు అర్చకులు కోర్టును కూడా ఆశ్రయించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

నేడు కేఎంసీ ఉద్యోగులకు కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని జూనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అకౌంటెంట్‌లు, బిల్‌కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు, నాలుగో తరగతి ఉద్యోగులకు కలెక్టరేట్‌లో మంగళవారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆయా ఉద్యోగులను జిల్లా కేడర్‌గా గుర్తించిన ఉన్నతాధికారులు కలెక్టర్ సమక్షంలోనే బదిలీలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కమిటీ ఆధ్వర్యాన బదిలీల ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు.

అంతటా అదే సందడి

ఖమ్మం సహకారనగర్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో బదిలీ సందడి నెలకొంది. జిల్లా, జోనల్, మల్టీ జోనల్ స్థాయిలో బదిలీలు జరుగుతుండగా రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జిల్లాలోని 58 శాఖల్లో 7,053మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో కేటగిరీలో 40శాతం మంది బదిలీకి అవకాశం ఇవ్వగా, కౌన్సెలింగ్ జరుగుతోంది. పలు శాఖల్లో ఉద్యోగులు ఆప్షన్లు నమోదు చేసుకుంటున్నా విద్యాశాఖకు మాత్రం మార్గదర్శకాలు రాలేదని సమాచారం. ఇక సీపీఓ కార్యాలయంలో ఇద్దరికి, పౌర సరఫరాల శాఖలో ఒకరిద్దరికి, జిల్లా ఖజానా శాఖలో 28మంది వరకు బదిలీ జరిగే అవకాశముందని తెలిసింది. సర్వే అండ్ రికార్డ్స్ శాఖలో ఒకరిద్దరికి, రెవెన్యూ శాఖలోని సీనియర్ అసిస్టెంట్ కేడర్‌లో 20మంది వరకు స్థానచలనం కలగనుంది.

ఖమ్మం ఏఎస్సీడీఓ హసన్‌పర్తికి బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమశాఖలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. హైదరాబాద్‌లోని ఎస్సీ కమిషనర్ కార్యాలయంలో సోమవారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జోన్ల వారీగా ఉద్యోగులు, వసతిగృహ సంక్షేమ అధికారుల బదిలీ చేపట్టగా, ఖమ్మం ఏఎస్సీడీఓ శ్రీలత హసన్‌పర్తి ఏఎస్సీడీఓగా బదిలీ అయినట్లు తెలిసింది. ఇక ఖమ్మం ఏఎస్సీడీఓగా ఎవరూ ఆప్షన్ ఇవ్వకపోవడంతో పోస్టు ప్రస్తుతానికి ఖాళీగా ఉన్నట్లు సమాచారం. అలాగే, వసతిగృహ సంక్షేమ అధికారుల బదిలీల ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగినట్లు సమాచారం.

సీతారామ డిజైన్ మార్పుతో | రైతులకు అన్యాయం

- తొలుత స్థానిక అవసరాలకే నీరు కేటాయించాలి
- ఎమ్మెల్యేలకు గోదావరి జలాల సాధన కమిటీ వినతి



వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న గుమ్మడి నర్సయ్య, నాయకులు

బూర్గంపాడు/ఇల్లెందు/వైరా: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో ప్రారంభించిన సీతారామ ప్రాజెక్ట్ డిజైన్లలో మార్పులు చేయడం ద్వారా ఏజెన్సీ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందని.. ఇకనైనా స్పందించి తొలుత స్థానిక అవసరాలకు నీరు దక్కేలా చూడాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కోరారు. గోదావరి జలాల సాధన కమిటీ ఆధ్వర్యాన నాయకులు సోమవారం పినపాక, ఇల్లెందు, భద్రాచలం, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, రాందాస్‌నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ సీతారామ ప్రస్తుత డిజైన్‌తో మొదటి విడతలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని 26 మండలాలకు సాగునీరు అందిస్తామని పాలకులు చెబుతుండగా.. ఇందులో ఏజెన్సీ మండలాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఆయకట్టులో మూడింట రెండొంతులు పాత ఆయకట్టు స్థిరీకరణ జరుగుతున్నందున పరిశీలించాలని కోరారు. ఇదేరీతిలో ముందుకు సాగితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు ఏజెన్సీ రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకుని గోదావరి జలాలను కృష్ణానది ఆయకట్టుకు తరలించడానికి ముందు ఇల్లెందు తదితర నియోజకవర్గాల రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో గోదావరి జలాల సాధన కమిటీ నాయకులు సిలివేరు సత్యనారాయణ, రాంసింగ్, ఆలేటి కిరణ్, నూతలపాటి వెంకటేశ్వరరావు, బుర్రా వెంకన్న, బంధం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యోగ, పెన్షనర్లకు 30 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలని పెన్షనర్ల జేఏసీ జిల్లా నాయకుడు కల్యాణం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బకాయి ఉన్న ఐదు డీఏలు విడుదల చేయడమే కాక అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య కార్డులు అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు విడుదల చేయాలని, రూ.398 వేతన టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షన్ నిర్ధారించాలని, సీనియర్ సిటిజన్లకు బస్ చార్జీల్లో 40 శాతం రాయితీ కల్పించాలని కోరుతూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందచేశారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోపీచంద్, పరిశా పుల్లయ్య, ఉమా మహేశ్వరరావు, మహేశ్వరుడు, మధుసూదన్‌రావు, జెల్లా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, కృష్ణమూర్తి, సీతారాములు, వైకుంఠరావు, మీరాఖాన్, బాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, శ్రీధర్, ఝాన్సీ, రాములమ్మ, కుటుంబరావు, కృష్ణారావు, వీరబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీ పిల్లలను ఇలాగే వదిలేస్తారా?



గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న బీసీడబ్ల్యూఓ జ్యోతి

వైరారూరల్: 'పాఠశాలకు మూడు వైపులా ప్రహరీ లేకపోగా.. పొలాల నుంచి విషపురుగులు వస్తున్నాయని తెలిస్తే మీ పిల్లలైనా ఇక్కడే ఉంచుతారా.. ఇన్నాళ్లు ప్రహరీ లేదని ఎందుకు నివేదిక ఇవ్వలేదు' అంటూ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరా మండలం రెబ్బవరంలోని ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సోమవారం ఆమె బీసీ గురుకులాల ఆర్‌సీఓ అంజలితో కలిసి తనిఖీ చేశారు. వంట చేసేది పురుషుడు కావడం, అక్కడి నుంచి స్నానపు గదులు కనిపిస్తుండడంపై మండిపడ్డారు. భవనంలో ఏడు గదులను బోధనేతర అవసరాలకు వాడుతుండడంపై ప్రిన్సిపాల్ రాధికను మందలించారు. అంతేకాక ప్రిన్సిపాల్, ఆమె భర్త భవనంలోని పైఅంతస్తులో నివాసముంటున్నట్లు గుర్తించి ఆడపిల్లలు ఉండే పాఠశాల, వసతిగృహంలో ఎలా ఉంటున్నారని ప్రశ్నించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

రెబ్బవరంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ హామీ ఇచ్చారు. పాఠశాలను సోమవారం రాత్రి సందర్శించిన ఆయన విద్యార్థినుల సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. నాయకులు బొర్రా రాజశేఖర్, శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు, పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద బస్‌షెల్టర్



బస్ షెల్టర్ నిర్మాణానికి పిల్లర్లు వేస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌కు వచ్చివెళ్లే వారు బస్సుల కోసం రహదారిపై ఎండావానలో వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడ బస్‌షెల్టర్ లేకపోవడంతో సమస్య ఎదురవుతుండగా ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముజమ్మిల్ ఖాన్ విషయాన్ని గుర్తించారు. ఈనేపథ్యాన ఆయన ఆదేశాలతో కలెక్టరేట్ ప్రధాన గేట్ పక్కన ఖాళీస్థలంలో బస్‌షెల్టర్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. అయితే, ఎదుటివైపు స్థలం లేకపోవడంతో సైడ్ డ్రెయిన్‌పై బస్ షెల్టర్ నిర్మించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

హెచ్చు పాటదారుడికే పండితాపురం సంత

గ్రామసభ తీర్మానంతో నిర్ణయించిన అధికారులు



వీరన్నను అభినందిస్తున్న అధికారులు

కామేపల్లి: పశువుల క్రయవిక్రయాలకు రాష్ట్రంలోనే పేరున్న కామేపల్లి మండలం కొమ్మినేపల్లి (పండితాపురం) గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారంతపు సంత కౌలు బాధ్యతల అప్పగింత పూర్తయింది. పలుమార్లు వేలం నిర్వహించినా ప్రభుత్వ మద్దతు ధర రాక పోవడంతో అధికారులు మూడుసార్లు వాయిదా వేశారు. ఈ మూడు సార్లు హెచ్చు పాటదారుడిగా భూక్యా వీరన్న నిలవడంతో సోమవారం సంత ఆవరణంలో ఎంపీడీఓ రవీందర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు మూడో వంతు జనాభా 1,551 మందికి గాను హాజరుకావాల్సి ఉన్నా కోరం పూర్తి కాకపోవడంతో గంట పాటు వాయిదా వేశారు. ఆతర్వాత కూడా సరిపడా జనాభా రాకున్నా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్చు పాటదారుడైన వీరన్నకు సంత నిర్వహణ బాధ్యతలు అప్పగించే విషయమై 327 మంది ఆమోదం తెలిపారు. దీంతో 39 వారాలకు గాను రూ.1,46,10,000 చెల్లించేలా వీరన్నకు సంత కౌలు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు ఆయన మొదటి వాయిదా రూ.53.70లక్షలు చెల్లించాడు. దీంతో కొద్ది నెలలుగా ఎటూ తేలని సంత వేలం ప్రక్రియ పూర్తయినట్లయింది. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేయగా ఎంపీఓలు రాజారావు, సత్యనారాయణ, కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, కార్యదర్శి గుగులోత్ నెహ్రూతో పాటు అనిల్‌కుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాల్సిందే..

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, సూర్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సూర్యం

ఖమ్మంమయూరిసెంటర్: మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్లను అమలుకు కుట్ర పన్నిందని.. ఇకనైనా పునఃసమీక్షించి రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణ, కె.సూర్యం డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం జరిగిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో జరగనున్న లోక్‌సభ సమావేశాల్లో లేబర్ కోడ్ల రద్దుపై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, బొగ్గు బ్లాక్‌ల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని సింగరేణికి అప్పగించాలన్నారు. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. అలాగే, తెలంగాణలో సంఘటిత, అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న వారికి బేసిక్ పేను నిర్ణయించి దాని ఆధారంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంకా గ్రామపంచాయతీ, కేజీబీవీ, ఆస్పత్రుల్లో కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ఆధారంగా జీతాలు పెంచి ఇవ్వాలని, బీడీ కార్మికులకు జీవన భృతి అమలు చేయాలని కృష్ణ, సూర్యం కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎల్.పద్మ, ఏ.నరేందర్, నాయకులు జి.రామయ్య, కే.రాజన్న, వెంకటేష్, కె.రవి, యాకూబ్ షావలీ, మధుసూదన్‌రెడ్డి, వి.ప్రవీణ్, సూర్యం, వెంకన్న, రాజేశ్వర్, జగన్, దేవాదానం, సాంబశివుడు, తోకల రమేష్, సూర్యం, హన్మంతు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ఖమ్మంరూరల్: పోలీసుల జాబితాలో అనుమానితురాలిగా ఉన్న మండలంలోని తెల్దారుపల్లికి చెందిన సైదమ్మ ఇంట్లో తనిఖీకి వచ్చిన పోలీసులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ పుష్కుమార్, హెడ్‌కానిస్టేబల్ భాస్కర్‌రావు సైదమ్మ సోమవారం తనిఖీకి వచ్చారు. ఈక్రమంలో ఆమె కుమారుడు సాయిరాం పోలీసులతో దురుసుగా ప్రవర్తించి వారి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

40 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

వేంసూరు: మండలంలోని మొద్దులగూడెం పరిసర లక్ష్మీ నరసింహారావు ఫ్లోర్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామంలోని డీలర్ నక్క శంకర్‌రావు పేదల నుంచి బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్‌లో అమ్మేందుకు నిల్వ చేసిన మరో 20 క్వింటాళ్ల బియ్యం కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పెన్షన్ ఇప్పించరూ..

దివ్యాంగుడైన ఈ బాలుడు ఏ పనీ చేసుకోలేడు. తల్లిదండ్రుల అండ లేకుండా ఎక్కడికీ వెళ్లలేడు. ఖానాపురం హవేలికి చెందిన చంద్రశేఖర్ కుమారుడు జాబిశెట్టి చరణ్‌కు పదేళ్లు. గత ఐదేళ్లుగా సదరం సర్టిఫికెట్ కోసం తిరుగుతున్నా ఆన్‌లైన్ కావడం లేదని అధికారులు తిప్పి పంపుతున్నారు. దీంతో బాలుడు తండ్రి, తాత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డేకు వచ్చి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు తమ ఆవేదన వెల్లడించారు. ఈమేరకు స్పందించిన కలెక్టర్ బాలుడిని భవిష్య పాఠశాలలో చేర్పించడంతో పాటు సదరమ్ సర్టిఫికెట్ ఇప్పించి పింఛన్ మంజూరయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రోడ్డుప్రమాదంలో కొడవటిమెట్ట వాసి మృతి



ప్రభాకర్ (ఫైల్)

తల్లాడ: చౌటుప్పల్ సమీపాన లక్కవరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లాడ మండలం కొడవటిమెట్టకు యువకుడు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కొడవటిమెట్టకు చెందిన మోదుగు ప్రభాకర్(30), మోదుగు విజయ్, శ్రీను హైదరాబాద్ వెళ్లి మినీ వ్యాన్‌లో సెంట్రింగ్ లోడ్ తీసుకొస్తున్నారు. ఈక్రమంలో లక్కవరం వద్ద వీరి వాహనం కంటెయినర్‌ను ఢీకొట్టడంతో ప్రభాకర్(30) అక్కడికక్కడే మృతి చెందగా విజయ్, శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు పోస్టుమార్టం అనంతరం ప్రభాకర్ మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

నేలకొండపల్లి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మండలంలోని శంకరగిరి తండాకు చెందిన బానోత్ శంకర్(23) నాలుగు రోజుల క్రితం కుటుంబ తగాదాల కారణంగా పురుగుల మందు తాగాడు. ఆయనను కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. శంకర్‌కు భార్య ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లుపోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

బోనకల్: మండలంలోని రావినూతలకు చెందిన విద్యార్థిని బోయినపల్లి రిషిత(17) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన బోయినపల్లి అచ్యుత్‌రావు – రమాదేవి దంపతుల పెద్ద కుమార్తె రిషిత మధిరలోని గురుకులంలో పదో తరగతి పూర్తిచేయగా ఇంటర్‌లో చేర్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ఆమె కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుండగా సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగి ఇంట్లో పడుకుంది. సాయంత్రం పాఠశాల నుంచి ఆమె చెల్లి వచ్చేసరికే రిషిత మృతి చెంది ఉండడంతో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు.